## మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు గ్రీన్‌సిగ్నల్

### ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు కేంద్రం లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): వరంగల్ జిల్లా మామునూరులో కొత్త ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కీలక ముందడుగు పడింది. ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కేంద్రం శుక్రవారం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు లేఖ ఇచ్చింది. త్వరగా పనులు చేపట్టాలని ఎయిర్‌పోర్ట్ అథారిటీని పౌరవిమాన యానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ఆదేశించారు. ఎయిర్‌పోర్ట్‌కు గ్రీన్‌సిగ్నల్ పడడంతో వరంగల్ ప్రాంతానికి ప్రయాణ సౌకర్యాలు మరింత పెరగనున్నాయి. విమాన యాన విస్తరణ, వ్యాపారం, పర్యాటక రంగం అభివృద్ధి జరగనుంది.

**కేటీఆర్ ప్రత్యేక చొరవ**

బీఆర్ఎస్ హయాంలో మాజీ మంత్రి కేటీఆర్ మామునూరు ఎయిర్‌పోర్ట్ కోసం ప్రత్యేక చొరవ చూపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణ సమయంలో జీఎంఆర్‌తో కుదిరిన ఒప్పందం ప్రకారం 150 కిలో మీటర్ల పరిధిలో 2029 వరకు మరో ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి, నిర్మాణం చేయొద్దని షరతు ఉంది. ఇదే వరంగల్ జిల్లా మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు ప్రతికూలంగా మారింది. కేటీఆర్ పలుమార్లు ఎయిర్‌పోర్ట్ అథారిటీతో సంప్రదింపులు జరిపారు. అవసరమైన భూమిని రైతుల నుంచి సేకరించి అథారిటీకి అప్పగిస్తామని కోరారు. ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్ట్ అవసరాన్ని వివరించారు. ఆ చర్చలు కొలిక్కి రావడంతోనే కేంద్రం మామునూరు ఎయిర్‌పోర్ట్‌ను ఉడాన్ పథకంలో చేర్చేందుకు అంగీకరించింది. కేటీఆర్ చూపిన ప్రత్యేక చొరవతో నేడు మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు మార్గం సుగుమమైంది.

**హరీశ్, వినోద్‌కుమార్ హర్షం**

మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలపడం మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హర్షం వ్యక్తంచేశారు. హనుమకొండ ఎంపీగా తన పదవీకాలంలో పార్లమెంట్‌లో ఈ సమస్యను చాలా సార్లు ప్రస్తావించినట్టు బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. ఎయిర్‌పోర్ట్‌తో ఈ ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

# 'రోళ్లవాగు' పూర్తయినా రైతులకు దక్కని ఫలాలు

**అటవీశాఖ క్లియరెన్స్ సాధించలేని దైన్యం**

**ప్రాజెక్టుకుషెట్టర్లు బిగించలేని వైనం**

- నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్న రాష్ట్ర సర్కార్
- చోద్యం చూస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు
- నెరవేరని ఆనాటి కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యం
- 50 వేల ఎకరాల పంటలకు అందనినీరు
- ఆందోళనలో సారంగాపూర్, బీర్‌పూర్, ధర్మపురి మండలాల అన్నదాతలు

జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టు

జగిత్యాల, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రోళ్లవాగు ప్రాజెక్టుపై నేటి కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో 95 శాతం మేర ప్రాజెక్టు ఆధునీకరణ పనులు పూర్తవగా, కేవలం షెట్టర్లు బిగించి, అటవీశాఖ అనుమతి పొందాల్సి ఉన్నది. ఆ రెండూ పూర్తిచేస్తే 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే నాటి బీఆర్ఎస్ సర్కార్ లక్ష్యం నెరవేరుతుంది. కానీ ప్రాజెక్టుకు షెట్టర్లు బిగించేందుకు, అటవీశాఖ అనుమతిని సాధించలేక కాంగ్రెస్ సర్కారు చేష్టలుడిగి చూస్తున్నది. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి ఒకవైపు, ఇక్కడి ప్రజాప్రతినిధుల పట్టింపులేని తనంతో సాగునీరు లేక ఈ ప్రాంత రైతులు దిగాలుపడుతున్నారు. ఒక టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యంతో, జగిత్యాల జిల్లా సారంగాపూర్, బీర్‌పూర్, ధర్మపురి మండలాల పరిధిలో 50 వేల ఎకరాలకు సాగునీటిని అందించి, పంటలను స్థిరీకరించాలనేది ఈ ప్రాజెక్టు ఉద్దేశం. రూ.136 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు ఆధునీకరణ పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం 95 శాతం మేర పూర్తిచేసింది. బీర్‌పూర్ మండలంలోని 6 వేల నుంచి 8 వేల ఎకరాల భూమికి సాగునీరు అందుతుంది. బీర్‌పూర్ మండలంలోని బీర్‌పూర్, నర్సింహులపల్లి, తుంగూర్, కొల్వాయి, చర్లపల్లి, కండ్లపల్లి, రంగసాగర్, మంగెళ, తాళ్లధర్మారం, కమ్మునూరు గ్రామాలకు సాగునీరు అందుతుంది. ధర్మపురి నియోజకవర్గంలో ధర్మపురిలోని దొంతాపూర్, తీగల ధర్మారం, దమ్మన్నపేట, రాజారం, జైన, నక్కలపేట, తుమ్మెనాల, మగ్గిడి గ్రామాల పరిధిలోని సుమారు 12 వేల ఎకరాలకు సాగునీటి సౌకర్యం ఏర్పడుతుంది.

**రోళ్లవాగు ప్రాజెక్టు పూర్వాపరాలు**

రోళ్లవాగు బీర్‌పూర్ అటవీ ప్రాంతంలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన స్థలం. దీన్ని నాలుగు దశాబ్దాల క్రితం కొంత అభివృద్ధి చేసి, చిన్న ప్రాజెక్టుగా స్థిరీకరించారు. వేసవిలో నీటి లభ్యత లేని సమయంలో ఈ వాగు నీటితో నింపితే బాగుంటుందన్న ఆలోచనతో ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి డీ-53 కాలువను ఫీడర్ చానల్‌గా ఏర్పాటుచేశారు. 1989లో రోళ్లవాగును కొంత ఆధునీకరించి ప్రాజెక్టుకు రెండు స్లూయిజ్‌లు ఏర్పాటుచేశారు. తాగు, సాగు నీటి కోసం ప్రాజెక్టు నుంచి కాలువలను సారంగాపూర్, ధర్మపురి మండలాల పరిధిలో తవ్వించారు. ఈ ప్రాజెక్టుకు లక్ష్మీనృసింహ స్వామి ప్రాజెక్టుగా పేరు పెట్టారు. ఈ ప్రాజెక్టును మరింత మెరుగు పరిచేందుకు, ఆధునీకరించేందుకు అవకాశాలున్నాయని అధికారులు అప్పుడే ప్రతిపాదనలు రూపొందించారు. కానీ, గత పాలకులు పట్టించుకోలేదు. మూడు దశాబ్దాలుగా ఈ ప్రాజెక్టు ఆధునీకరణ రాజకీయ నేతలకు ఎన్నికల హామీ అంశంగానే మిగిలింది.

**కేసీఆర్ హయాంలో ప్రాజెక్టు నిర్మాణం**

తెలంగాణ ఏర్పడిన అనంతరం 2014లో జరిగిన ఎన్నికల సమయంలో ధర్మపురి ఎమ్మెల్యేగా పోటీచేసిన కొప్పుల ఈశ్వర్, నిజామాబాద్ ఎంపీగా పోటీచేసిన కల్వకుంట్ల కవిత రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునీకరణకు హామీ ఇచ్చారు. కేసీఆర్ ఆధ్వర్యంలో తొలి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునీకరణతోపాటు, ధర్మపురి ప్రాంతంలోని మరికొంత ఆయకట్టు స్థిరీకరణ కోసం రూ.60 లక్షలు కేటాయించి సర్వే చేశారు. 2017 మేలో అప్పటి భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రాజెక్టు ఆధునీకరణ పనులను ప్రారంభించారు. కాలక్రమంలో ప్రాజెక్టు అంచనాలు పెరిగి రూ.136 కోట్లకు చేరుకున్నా, ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేయించింది.

**అటవీశాఖ అనుమతిపై జాప్యం**

రోళ్లవాగు ప్రాజెక్టు పరిధిని విస్తరణ విషయంలో భూసేకరణ కీలక అంశంగా మారింది. విస్తరణకు దాదాపు వెయ్యి ఎకరాల భూమిని సేకరించాల్సి వచ్చింది. ఇందులో 200 ఎకరాలు పట్టాదారులవి కాగా, మరో 815 ఎకరాలు రిజర్వు ఫారెస్ట్ పరిధిలో ఉన్నది. అంత మొత్తంలో మరో మూడు చోట్ల భూమిని గుర్తించి రిజర్వు ఫారెస్ట్‌కు అందజేసేందుకు తీర్మానించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న రిజర్వు ఫారెస్ట్‌కు డీపీఆర్‌ను పంపించి, ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఫారెస్ట్ అనుమతులు మంజూరు కాలేదు. దీంతో ప్రాజెక్టుకు షెట్టర్లు పెట్టలేకపోయారు. ఎన్నిసార్లు కేంద్రంతో విన్నవించినా, వారి నుంచి సానుకూల స్పందన రాలేదు. ఈ క్రమంలోనే 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇప్పటికి 15 నెలలు గడిచినా ప్రభుత్వం రిజర్వు ఫారెస్ట్ నుంచి అనుమతులు సాధించడంలో విఫలమైంది. ఫలితంగా ప్రాజెక్టుకు షెటర్లు పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. ప్రాజెక్టు పరిధిలోని దాదాపు 18 గ్రామాల్లో సాగునీటికి తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. చాలా గ్రామాల్లో రైతులు నీరు లేక పొలాలను పశువుల మేతకు వదిలిపెట్టుతున్నారు.

### ప్రాజెక్టును పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక కేసీఆర్ నాయకత్వంలో ఈ ప్రాంత రైతులకు నీళ్లందించాలని రోళ్లవాగు ప్రాజెక్టును ఆధునీకరించాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 15 నెలలైనా రోళ్లవాగు ప్రాజెక్టును పట్టించుకోవడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే 95 శాతం పనులు పూర్తయ్యాయి. అటవీ అనుమతి, షట్టర్ల బిగింపు పనులు మిగిలాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని, అనుమతి తీసుకొని, మేవరకు షెట్టర్ బిగించి, రైతులను ఆదుకోవాలి.

– మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

### 95 శాతం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి

ప్రాజెక్టు నిర్మాణం, విస్తరణ కోసం రోళ్లవాగు పరిసర ప్రాంతాల్లో ఉన్న సాగుభూమికి రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.7.50 లక్షల నష్టపరిహారం చెల్లించి 200 ఎకరాలను సేకరించింది. భూసేకరణ కోసమే ప్రభుత్వం రూ.16 కోట్లు వెచ్చించింది. తర్వాత ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచింది. సహజసిద్ధంగా కొండల మధ్య ఏర్పడిన ఈ ప్రాజెక్టు విస్తీర్ణం పెంచుతూ, ప్రాజెక్టు చుట్టూ మూడు కట్టలు నిర్మించారు. 425 మీటర్ల పొడువు, 16 మీటర్ల ఎత్తుతో ఒక కట్ట నిర్మించగా, రెండో కట్టను 300 మీటర్ల పొడువు రెండున్నర మీటర్ల ఎత్తుతో అటవీ ప్రాంతంలో నిర్మించారు. మూడో కట్టను 860 మీటర్ల పొడవున 21 మీటర్ల ఎత్తుతో నిర్మించారు. ప్రాజెక్టులో 156 మీటర్ల పొడవున 16.50 మీటర్ల వెడల్పు, 12.50 మీటర్ల ఎత్తుతో మత్తడి నిర్మాణం పూర్తిచేశారు. ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి నీటిని తరలించే డీ-53 కెనాల్ మరమ్మతులతోపాటు దాని వెడల్పును సైతం పెంచారు. రోళ్లవాగు ప్రాజెక్టు నుంచి నీటిని తరలించే రెండు కాలువలనూ ఆధునీకరించారు. ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తిచేశారు. 2022 జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టు నిర్మాణ పనులకు తీవ్ర అవరోధం ఏర్పడింది. వర్షాల వల్ల వచ్చిన భారీ వరదలకు ప్రాజెక్టులో ఇసుక, మట్టిమేటలు వేసింది. వాటన్నింటినీ తొలగించి మళ్లీ ప్రాజెక్టు పనులు పూర్తిచేశారు. ఎస్సారెస్పీ నుంచి నీటిని డీ-53 కాలువ ద్వారా సైతం నీటిని లాంఛనంగా మళ్లించారు.

## తెలుగు తప్పనిసరి చట్టం తెచ్చిందే కేసీఆర్ సర్కార్

- వాస్తవాలు తెలుసుకోక కాంగ్రెస్ సర్కారు నిందలు
- 2018లోనే యాక్ట్-10 రూపకల్పన

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ బోర్డుల పాఠశాలల్లో తెలుగు తప్పనిసరి చట్టం అమలుపై కాంగ్రెస్ సర్కారు అబద్ధాలు ప్రచారం చేస్తున్నది. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి అమలుచేయలేదని కేసీఆర్ ప్రభుత్వంపై అభాండాలేస్తున్నది. వాస్తవానికి రాష్ట్రంలో తెలుగు తప్పనిసరిగా బోధించాలన్న చట్టాన్ని రూపొందించిందే కేసీఆర్ సర్కారు. తెలుగుభాష పరిరక్షణకుగానూ పాఠశాలల్లో తెలుగును ఓ సబ్జెక్టుగా బోధించేలా 2018 మార్చి 30న యాక్ట్-10 పేరుతో అప్పటి ప్రభుత్వం చట్టాన్ని రూపొందించింది. దీనిని అమలుచేయాలని సూచిస్తూ 2018 ఏప్రిల్ 2న ప్రభుత్వం జీవో-15 జారీచేసింది. 2018-19 విద్యాసంవత్సరం నుంచి దశల వారీగా తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా అమలుచేశారు. 1,2,3,4,6,7,8,9 తరగతుల్లో తెలుగును బోధనాంశంగా అమలైంది కూడా ఈ ప్రణాళిక ప్రకారమే. 2022-23విద్యాసంవత్సరంలో 5, 10 తరగతుల్లో తెలుగును తప్పనిసరి చేసింది. వార్షిక పరీక్షలను నిర్వహించాలని సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ బోర్డు చైర్మన్లకు లేఖలు సైతం రాసింది. కరోనా నేపథ్యంలో స్కూళ్లు ఈ విషయంపై అంతగా దృష్టిసారించలేదు. ఇప్పుడు కొత్తగా 9, 10 తరగతుల్లో తెలుగును తప్పనిసరి చేస్తూ విద్యాశాఖ ఫిబ్రవరి 25న మెమో జారీచేసింది. 2026-27 విద్యాసంవత్సరంలో బోధించాలని ఆదేశాలివ్వడం గమనార్హం.

## కృష్ణా జలాలపై ఏపీ, తెలంగాణ రాజీ

- నీటి వినియోగానికి చర్చలతో ముందుకు
- 65 టీఎంసీలను పాడుపుగా వాడుకోవాలి
- ఇరు తెలుగు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ సూచన

హైదరాబాద్, ఫిబ్రవరి28 (నమస్తే తెలంగాణ): కృష్ణాజలాల వినియోగంలో ఏపీ, తెలంగాణ రాజీకి వచ్చాయని, అందుబాటులో ఉన్న జలాలను చర్చించుకుని వినియోగించుకునేందుకు ఒప్పుకున్నాయని కేఆర్ఎంబీ (కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు) వెల్లడించింది. ఈ మేరకు గురువారం నిర్వహించిన బోర్డు సమావేశ వివరాలను శుక్రవారం విడుదల చేసింది. శ్రీశైలంలో కనీస నీటి నిల్వ స్థాయి 820 అడుగులుగా నిర్ధారించామని, ఆపైన రిజర్వాయర్‌లో 35.613 టీఎంసీలు ఉన్నాయని, సాగర్ ఎండీడీఎల్‌ను 515గా నిర్ధారించగా, అందులో 29.593 టీఎంసీలు, మొత్తంగా 65 టీఎంసీలే అందుబాటులో ఉన్నాయని కేఆర్ఎంబీ తెలిపింది. ఆ నీటిని పొదుపుగా వాడుకునేందుకు తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు రాజీకి వచ్చాయని, ఎప్పటికప్పుడు చర్చించుకొని నీటిని వాడుకునేందుకు ఒప్పుకున్నాయని పేర్కొన్నది. తాగునీటికి ఇబ్బందులు రాకుండా రెండు ప్రాజెక్టుల నుంచి నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని, ప్రతి 15 రోజులకోసారి ఈఎన్‌సీలు, ప్రతి నెలాఖరున 2 రాష్ట్రాల సెక్రటరీలు సమావేశమై చర్చించుకోవాలని సూచించామని బోర్డు వెల్లడించింది. ఇదిలా ఉంటే ఏ రాష్ట్రానికి ఎంతనీటిని వాడుకోవాలనే విషయాన్ని మాత్రం బోర్డు వెల్లడించలేదు. అధికారులు సైతం చెప్పకపోవడం గమనార్హం. ఈ ఏడాది ఏపీ ఇప్పటికే కోటాకు మించి కృష్ణా జలాలను తరలించగా, తాజాగా మళ్లీ నీటి తరలింపునకు పట్టుబట్టింది. తెలంగాణ కోటా మేరకు నీళ్లను వినియోగించుకోకపోవడమే కాక, 116 టీఎంసీలు అవసరమవుతాయని తొలుత ఇండెంట్ పెట్టి, ఆ తర్వాత 63 టీఎంసీలు కావాలని గగ్గోలు చేసింది. వాదనలు వినిపించలేక, నీటివాటాను సాధించలేక తుదకు ఏపీతో రాజీపడింది. మరోవైపు సాగర్ చివరి ఆయకట్టులో పంటలు ఎండిపోతున్న పరిస్థితుల్లోనూ తెలంగాణ ప్రభుత్వం చేతులేత్తయడంతో రైతుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

## కాలుష్యంపై పీసీబీ నిర్లక్ష్యం

- ఫార్మా కంపెనీలతో ఉన్నతాధికారుల కుమ్మక్కు
- కమిటీల పేరుతో ఏండ్లతరబడి కాలయాపన
- పీసీబీ భేటీలో అంతమ్మగూడెం ప్రజల ఆవేదన

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలపై చర్యలు చేపట్టడంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం అంతమ్మగూడెం గ్రామస్తులు ధ్వజమెత్తారు. తమ గ్రామం సమీపంలోని శ్రీజయ, వినీత్, హజేలో, బృందావన్ ల్యాబొరేటరీలతోపాటు ఆర్కెమిడీస్, వీజేసాయి, కెమిక్ లైఫ్‌సైన్స్, ఎస్‌వీఆర్, రావూస్, ఆప్టిమస్ పరిశ్రమల నుంచి కాలుష్యం వెలువడుతున్నదని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన పీసీబీ ఆయా కంపెనీలతో కుమ్మక్కై ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఫార్మా కంపెనీల కాలుష్యంపై ఫిర్యాదు చేసిన అంతమ్మగూడెం గ్రామస్తులు, రైతులతోపాటు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం పీసీబీ సమావేశాన్ని నిర్వహించింది. హైదరాబాద్ సనత్‌నగర్‌లోని పీసీబీ రాష్ట్ర కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. ఈ భేటీకి హాజరయ్యేందుకు 12 మంది ఫిర్యాదుదారులు సనత్‌నగర్‌కు చేరుకోగా కేవలం ముగ్గురిని మాత్రమే సమావేశంలో పాల్గొనేందుకు అనుమతించారు.

**కమిటీల పేరుతో కాలయాపన**

ఫార్మా పరిశ్రమల కాలుష్యంపై ఇప్పటికే ఎన్నోసార్లు పీసీబీకి ఫిర్యాదు చేసినప్పటికీ కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నదని, అధికారులు కంపెనీలఖు కొమ్ముకాస్తూ నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏసీబీకి పట్టుబడిన రవీందర్

## బిల్లు కోసం 20 వేలు లంచం

### ఏసీబీకి చిక్కిన హెచ్ఎం

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, ఫిబ్రవరి 28 : బిల్లు చెల్లింపు విషయంలో పాఠశాల హెచ్ఎం రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకున్నది. కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలలో ఓ కరాటే మాస్టర్ విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తున్నాడు. అతడికి సంబంధించి రూ.30 వేల బిల్లు ప్రభుత్వం నుంచి మంజూరైంది. ఆ బిల్లును సదరు కరాటే మాస్టర్‌కు చెల్లించకుండా పాఠశాల హెచ్ఎం తాటి రవీందర్ ఇబ్బందులకు గురిచేయడంతోపాటు రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. శుక్రవారం పాఠశాలలో కరాటే మాస్టర్ నుంచి హెచ్ఎం రవీందర్ రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## ఆధార్ లేకపోయినా వైద్యం

### దవాఖానల్లో సేవలపై హైకోర్టుకు ప్రభుత్వం నివేదిక

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): వైద్యసేవలు పొందాలనుకునే రోజులు ఆధార్ కార్డును సమర్పించాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆధార్ కార్డుతో నిమిత్తం లేకుండానే ప్రభుత్వ దవాఖానల్లో వైద్యసేవలు అందిస్తున్నట్టు హైకోర్టుకు నివేదించింది. ఆధార్ కార్డు లేని వారికి ఉస్మానియా దవాఖానలో చికిత్స అందించడం లేదంటూ పత్రికల్లో వచ్చిన వార్త ఆధారంగా దాఖలైన పిల్‌పై హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఆధార్ కార్డు లేని ప్రమీలకు చికిత్స చేసేందుకు ఉస్మానియా వైద్యులు నిరాకరించారని పిటిషనర్ తరపు న్యాయవాది ఆకాశ్ బాగ్లేకర్ తెలిపారు.

# కరెంటుకు కటకటే!

మొదటిపేజీ తరువాయి...

పేలిపోయే సబ్‌స్టేషన్లు, కాలిపోయే ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితి పునరావృతం కానుందా? అని రైతు సంఘాల నేతలు వాపోతున్నారు.

**ఇప్పుడే ఇలా ఉంటే..!**

రాష్ట్రంలో ఫిబ్రవరిలోనే గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 16,506 మోగావాట్లుగా నమోదైంది. మొత్తం విద్యుత్తు డిమాండ్‌లో వ్యవసాయం రంగం నుంచి 34 శాతం, గృహ, వాణిజ్యరంగాల నుంచి 66 శాతం డిమాండ్ ఉంటుంది. ఎండకాలం మనకు విద్యుత్తు ఇస్తున్న ఇతర రాష్ట్రాల్లోనూ డిమాండ్ పెరుగుతుంది. ఆయా రాష్ట్రాలు విద్యుత్తు ఇవ్వకపోతే పరిస్థితి ఏంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మన దగ్గర ఉత్పత్తిపై దృష్టి పెట్టకపోవడంతో రాష్ట్రం అంధకారమయ్యే దుస్థితి నెలకొన్నదని నిపుణులు పేర్కొంటున్నారు.

**తట్టుకోవడం కష్టమే**

శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు ఖాళీ అయ్యాయి. భూగర్భజలాలు అడుగంటాయి. చెరువుల్లోనూ నీటిలభ్యత తగ్గింది. కాలువల ద్వారా పారకం తగ్గింది. యాసంగి పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. పంటలు కాపాడుకునేందుకు రైతులు బోర్లు, బావుల మీద ఆధారపడుతున్నారు. దీంతో పంపుసెట్ల వినియోగం పెరిగింది. గృహ వినియోగానికి సంబంధించి ఏసీలు, ఫ్యాన్లు, కూలర్ల వాడకం పెరుగుతున్నది. పెరిగిన విద్యుత్తు సరఫరా డిమాండ్‌ను తట్టుకోవాలంటే వ్యవస్థలు పటిష్టంగా ఉండాలి. కానీ అందుకు కూడా విద్యుత్తు సంస్థలు సన్నద్ధంగా లేవని సమ్మర్ యాక్షన్ ప్లాన్ పురోగతి స్పష్టం చేస్తున్నదని నిపుణులు చెప్తున్నారు.

**తెలంగాణలో విద్యుత్తు సంక్షోభ స్వరూపం!**

| | |
|---|---|
| మొత్తం అవసరం | 308-310 మిలియన్ యూనిట్లు |
| ఇతర రాష్ట్రాల నుంచి కొంటున్నది | 159 మిలియన్ యూనిట్లు |
| గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ | 16,412 మోగావాట్లు |
| వ్యవసాయం | 34 శాతం |
| గృహ, వాణిజ్యరంగాలు | 66 శాతం |
| యూపీ బ్యాంకింగ్ ఒప్పందం | 1000-2,500 మెగావాట్లు, గడువు ఫిబ్రవరి 28 |
| | 1500-3000 మెగావాట్లు, గడువు మార్చి 31 |
| మధ్యప్రదేశ్‌తో ఒప్పందం | 150 మెగావాట్ల బదిలీ గడువు ఏప్రిల్ 15 |
| | 500 మెగావాట్ల ఒప్పదం గడువు ఏప్రిల్ 30 |
| సమ్మర్ యాక్షన్‌ప్లాన్ | కొలిక్కిరాని సబ్‌స్టేషన్ల నిర్మాణం, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు, 33 కేవీ, 11కేవీ ఫీడర్ల మార్పు |



**సమీపిస్తున్న బ్యాంకింగ్ గడువు**

ఒక రాష్ట్రం నుంచి విద్యుత్తును మరో రాష్ట్రం వాడుకుని, మళ్లీ అవసరమైనప్పుడు తీసుకునే పవర్ స్వాప్ అగ్రిమెంట్ (బ్యాంకింగ్) విధానం అమల్లో ఉంది. ఇందులోభాగంగా ఉత్తరప్రదేశ్ నుంచి 1000-2,500 మోగావాట్ల సామర్థ్యం గల పవర్ బ్యాంకింగ్ గడువు ఈ నెల 28తో ముగియనుంది. 1500-3000 మెగావాట్ల సామర్థ్యం గల పవర్ బ్యాంకింగ్ గడువు మార్చి 31తో ముగియనుంది. మధ్యప్రదేశ్ నుంచి 150 మెగావాట్ల విద్యుత్తు బదిలీ గడువు ఏప్రిల్ 15తో ముగియనుంది. 500 మెగావాట్లకు సంబంధించిన గడువు ఏప్రిల్ 30తో పూర్తవుతుంది.

**నత్తనడకన సన్నద్ధత**

వేసవి విద్యుత్తు డిమాండ్‌ను అదిగమించేందుకు సమ్మర్ యాక్షన్‌ప్లాన్ పేరుతో డిస్కంలు చేపట్టిన పనులేమీ కొలిక్కి రాలేదు. ప్రణాళికలో భాగంగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు, 33 కేవీ, 11కేవీ ఫీడర్లను మార్చడం వంటి పనులు చేయాలని నిర్ణయించారు. కానీ ఏ పనులు కూడా పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో డిమాండ్ మరింత పెరిగితే విద్యుత్తు వ్యవస్థలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు తట్టుకుంటాయా? అని అధికారులు కూడా అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

### గరిష్ఠ విద్యుత్తు డిమాండ్‌పై పొంతనలేని లెక్కలు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యుత్తు వినియోగంపై ప్రభుత్వం చెప్తున్న లెక్కలకు, ట్రాన్స్‌కో చెప్తున్న లెక్కలకు పొంతన కుదరడం లేదు. ఫిబ్రవరి 26న గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 16,506 మెగావాట్లకు చేరినట్టు ట్రాన్స్‌కో వెబ్‌సైట్ స్పష్టం చేసింది. కానీ, 16,601 మెగావాట్లుగా ఉన్నట్టు ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా శుక్రవారం ప్రకటించారు. దీంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**గరిష్ఠం 7-8 నిమిషాలే..**

సహజంగా ఉదయం 8 నుంచి 8:30 గంటల మధ్యలో విద్యుత్తు వినియోగం అధికంగా ఉంటుంది. ఆ సమయంలో గరిష్ఠ డిమాండ్ 16 వేల మెగావాట్లకు చేరి 7-8 నిమిషాల కొనసాగుతుంది. శుక్రవారం ఉదయం 7:52 గంటల సమయంలో గరిష్ఠ డిమాండ్ 16,387 మెగావాట్లకు చేరి, తర్వాత తగ్గుముఖం పట్టింది. రాత్రి 6:45కు 9,709 మెగావాట్లకు పడిపోయింది.

**ప్రత్యామ్నాయ ఏర్పాట్లు**

అత్యవసర సర్వీసులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ.. మార్చిలో గరిష్ఠ డిమాండ్ 17,500 మెగావాట్లకు చేరొచ్చని చెప్పారు.

# కోరంటి దవాఖానకు ఫీవర్

**హాస్పిటల్‌ను వేధిస్తున్న వైద్యుల కొరత • సీనియర్ రెసిడెంట్లు, పీజీలే దిక్కు**

**ఏడాది నుంచి ఖాళీగా ప్రొఫెసర్ల పోస్టులు • ప్రశ్నార్థకంగా మారిన వైద్య విద్య**

*హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ)/అంబర్‌పేట:* ఉ